
# గోడకి అటూ...ఇటూ...

డాక్టర్ ఎల్.కె. సుధాకర్

## రూ. 7,500 ద్వితీయ బహుమతి పొందిన కథ




**దేదీప్యమానంగా వెలిగిపోతున్న ఆ భవనాన్ని ఇప్పుడందరూ 'ధనలక్ష్మీ మేరేజీ ప్లాజా' అని పిలుస్తున్నప్పటికీ నారాయుడు తాత మాత్రం అలా పిలవడానికి ఇష్టపడడు. అటువేపు చూసినప్పుడల్లా అది అతడికి ఆదర్శనాటక కళాపరిషత్‌లానే కనిపిస్తుంటుంది. పదిహేనేళ్ళక్రితం ఆఖరిసారిగా అక్కడే నారాయుడు తన తోలుబొమ్మలాట ప్రదర్శనిచ్చేడు.**

అప్పటికే తోలు బొమ్మలాట ఒక మాయమై పోతున్న కళ. సినిమా వచ్చి పూర్తిగా గ్రామీణ కళల్ని మింగేసి, వ్యాపారం వచ్చి పూర్తిగా మానవ సంబంధాల్ని కరిగించేస్తోన్న సంధికాలం అది. ఎవరో ప్రముఖులు వచ్చిన సందర్భంగా ఏర్పాటు చేసేరు తోలుబొమ్మలాట. ప్రదర్శనలో కేతిగాడు, బంగారక్కల 'హాసికం'తో సహా అన్నీ అందర్నీ ఎంతో ఆకట్టుకున్నాయి. బొమ్మల్ని అంతా మెచ్చుకున్నారు. ఆ కళానైపుణ్యం అద్భుతం అన్నారు. ఒకటే పొగడ్తలు-ఆ బొమ్మల్ని చూస్తూ. ఇంగ్లీషులో సాగిన ఆ సంభాషణ నారాయుడికి అర్థం కాలేదు. మొత్తానికి ఆఖరి వాక్యం తాలూకు తెలుగు తర్జుమా మాత్రం నారాయుడికి చెవిలో వేసేరు-ఆ బొమ్మల్ని ఇరవై వేల రూపాయలిచ్చి ఎక్కడో మ్యూజియంకు తీసికెళ్ళిపోతున్నట్టు. తన తోలుబొమ్మలకి ఇరవై వేల రూపాయల ధర పలకడం అతడినేం ఆశ్చర్యానికి గురి చేయలేదు. ఫైగా వచ్చినోడు అమెరికా దొర.

వాడికి ఇరవై వేలు ఒక లెక్క కాకపోవచ్చు. కానీ.. అసలు తనెందుకు తన తోలుబొమ్మల్ని అమ్మేయాలో ఎవరూ వివరించడం లేదు. తనకీ తట్టలేదు సమాధానం. శీతాకాలపు చలి, తలుపు సందుల్లోంచి తెలీకుండా వచ్చి కమ్ముకుంటున్నట్టు- ఏదో జరుగుతోంది తన కళలకీ, తన నైపుణ్యానికీ, తమ సంప్రదాయాలకీ తన సంతోషాలకీనూ...

అన్నిటికంటే ముఖ్యంగా అతి సున్నితంగా నారాయుడిని బాధపెట్టిన మరో విషయం. ఆ

## సి.పి.బ్రౌన్ అకాడమీ - నవ్యవీక్లీ కథలపోటీ



వచ్చిన వాళ్ళంతా తన తోలుబొమ్మల్ని పొగిడినంతగా వాటిని ఆడించిన చేతివేళ్లని గుర్తించలేదు.. కనీసం.. పట్టించుకోలేదు.

తన తోలుబొమ్మల బేరం పూర్తయింది. డబ్బు చేతిలో పెట్టారు. తన బొమ్మలు మ్యూజియంకు వెళ్లిపోయాయి. రెండు తోలు బొమ్మలు మాత్రం సదరు మధ్యవర్తిత్వం దాతృత్వం(?) చేత ఆదర్శ నాటక కళాపరిషత్ గోడలకి వేలాడదీయబట్టాయి. వాటికింద దాత పేరు నారాయుడికి తెలీదు.

పొగిడి పొగిడి తన బొమ్మల్ని కొనేసినంత లౌక్యంగానూ.. ఆ తర్వాత ఆ థియేటర్ని కూడా వ్యాపార సంస్కృతి మింగేసింది. తాటాకు పందిళ్లేవిటీ.. రెడిక్యులస్ కంట్రీ హేబిట్స్. తాచుపాములొచ్చేయవూ తాటాకుల్లోకి. చక్కగా అన్ని హంగులతో మేరేజీ హాల్సు రెడీగా వుంటుంటే, ఈ పాత చింతకాయ ఆలోచనలూ, అలవాట్లూ ఏంటండీ బాబూ..డబ్బు పారేస్తే పందిరి గుంజ పాతడం నుంచి శోభనం గది ఏర్పాట్ల దాకా అన్నీ అమర్చిపారేస్తారు. చూస్తుండగానే ఆదర్శ నాటక కళా పరిషత్తు భవనం 'ధనలక్ష్మీ మేరేజీ ప్లాజా'గా మారిపోయింది.

తోలుబొమ్మలాడించిన చేతులు కూలిపన్లకి వెళ్లడానికి అలవాటుపడ్డాయి. గుడిసెల్ని అపార్ట్‌మెంట్‌లు మింగేసేక కాలుష్యం తోడై, అనారోగ్యం అనివార్య చుట్టమైంది. నెమ్మది నెమ్మదిగా,ఆ పల్లె సంప్రదాయాల్ని కాపాడినట్టు కాపాడిన ఆ గుడిసెవాసుల ఆరోగ్యం క్షీణించి క్షీణించి- అది, లెప్రసీ కాలనీగా స్థిరపడిపోయింది. నారాయుడు వంకరపోబోతోన్న తన చేతి కీళ్ల వంక చూసుకున్నాడు. తోలుబొమ్మలాడించి వినోదం పంచి ఒకానొక సంప్రదాయాన్ని మురిపెంగా మోసిన చేతులు.. ఇవాళ కుష్ఠురోగంతో వంకర తిరగబోయి.. నిశ్చలమై.. తననీ తన వారినీ అడుక్కుతినేవాళ్ళుగా ముద్ర వేసి..

''ఇంకా ఎంతసేపురా?''

''అయిపోద్దయిపోద్ది! భోజనాలు మొదలైన పావుగంట తర్వాత మొదటి బ్యాచి అయిపోతే మనకింక ఈ పూటకీ రేపటికీ కూడా బువ్వ దొరికినట్టే. ఇంకెంత ఇంకో అరగంటంతే'' అతడికి కొంచెం దూరంలో మరో ఇద్దరి సంభాషణ.

తాము కూర్చున్న చోట నుండి తలెత్తి చూస్తే మేరేజీ హాలు ఆవరణ. ఈ మధ్యకాలంలో అంత ఆర్భాటంగా జరిగిన కార్యక్రమం లేదంట. కోటి రూపాయలు పైనే ఖర్చుపెట్టారని చెప్పుకుంటున్నారు. కోటీశ్వర్రావు గారి ఏకైక కుమార్తె వివాహం మరి. లైట్లకాంతిలో రాత్రెప్పుడయిందో చెప్పడం పూర్తిగా కష్టం. అంత వెలుగులో అంతా స్పష్టంగా కనిపిస్తున్నారు నారాయుడికి. వేద మంత్రాల్ని ఆర్కెస్ట్రా వాళ్లని రికార్డింగ్ డాన్స్ వాళ్లూ- వాళ్లని మంగళ వాయిద్యాల వాళ్లూ మింగేస్తున్నారు. అంత పెద్ద ఆవరణలో అసలు పెళ్లి తంతు ఎక్కడ జరుగుతోందో అర్థం కానట్టే వుంది.

ఇంత ఆర్భాటంలోనూ నారాయుడికి కనిపించింది ఒకటే...కళ. కనీసం తన తోలుబొమ్మల్లో వున్నపాటి కళ కూడా లేకుండా...

* * *

ఆవరణ ద్వారంలో రెండు 'పెద్ద' మిక్కీమౌస్‌లు తిరుగుతున్నాయి(రు)- పిల్లలకి షేక్ హేండ్లిస్తూ. బ్రిటిష్ రాణి గారి నివాసం ముందుండే సెక్యూరిటీ గార్డుల్లా వేషాలేసుకున్న వాళ్లు నలుగురు. దూరంగా ఆవరణలో అందరి మధ్య తిరుగుతూ అందర్లోకి ఎత్తుగా, పన్నెండడుగుల ఎత్తులో చెక్క కాళ్లతో నడుస్తూ అందరికీ వినోదం పంచుతున్నారు ఓ ముగ్గురూ. వచ్చే కార్లూ, స్కూటర్లు, పెద్ద కార్లూ, పట్టు చీరలూ, సూట్లూ బూట్లూ, ఇంగ్లీషు సంభాషణలూ.

దూరం నుంచీ ఆ బొమ్మని చూస్తూ చంద్రిగాడు ''అదుగో అదుగో.. ఆ చుంచుబొమ్మలో వుంది మన సూరిగాడేరా నారి మావా!'' అన్నాడు నారాయుడితో తన్మయంగా. తోలుబొమ్మలాటకి ప్రసిద్ధి చెందిన తన వంశం తాలుకూ నాలుగో తరం వాళ్లు 'ఇచ్చట మిక్కీ మౌస్ వేషగాళ్లు, కర్రకాళ్ల వేషగాళ్లు మీ వివాహాది శుభకార్యములకు సరసమైన ధరలకి దొరికెదరు' అన్న బోర్డు పెట్టుకుని అలా అలా జీవనోపాధికి ఈ వ్యాపార సంస్కృతిలో ఒక మార్గం వెదుక్కోవడం అతడికి ఆనందం కలిగిస్తోంది. అంతకంటే మరో విచిత్రం..అడుక్కునే వాళ్లు..లేకుంటే వాళ్ల పిల్లలు.. ఆ ప్లాస్టిక్ బొమ్మల్లో దూరగానే, ఆ హడావుడిలో పాలు పంచుకునే అర్హత సంపాదించుకోవడం. ''ప్రపంచం ఇప్పుడు తొడుగుల మయంరా చెంద్రీ! అక్కడ తొడుగుంటే చాలు అన్ని మర్యాదలూనూ'' అన్నాడు చెంద్రిగాడితో. మనిషికి మనిషికీ మధ్య తొడుగు, మాటకి మాటకీ మధ్య తొడుగు. కృత్రిమ నవ్వు ముఖాలతో తెచ్చిపెట్టుకున్న తేజస్సు.

* * *

''ఐ హేట్ బెగ్గర్స్! కుక్కల్నీ పందుల్నీ కాదండీ. ఈ బెగ్గర్స్‌గాళ్లని కాల్చిపారేయాలి. అపుడు గానీ దేశం బాగుపడదు'' టై సర్దుకుంటూ చెప్తున్నాడు కుబేర కుమార్ లంబోదర ప్రసాద్‌తో.

అప్పటికీ ఆ ద్వారం దగ్గర్లో ఈగలు ముసిరినట్టు ముసిరారు ముష్టివాళ్లూ, వాళ్ల పిల్లలూ. సెక్యూరిటీ లాఠీ ఝుళిపించగానే ఒక్క సారిగా ఈగలు ఎగిరినట్టు ఎగిరిపోవడం మళ్ళీ ఝూమ్మంటూ వాలిపోవడం..

''బెగ్గర్స్ అంటే ఎవరు డాడీ'' అడిగాడు చంటిగాడు- కుబేరుడి కొడుకు.

''యు.కె.జి.కొచ్చావ్! బెగ్గర్స్‌ని గుర్తుపట్టలేవురా యూస్‌లెస్ ఫెలో! నా పరువు పోతుంది. నోర్మూసుకుని నడువు నాతో. ఇంకా నయం మీ అమ్మ దగ్గర్లేదు. తనూ గానీ వింటే..'' నాన్న తిట్లలోంచి, మిక్కీమౌస్ అందించిన షేక్ హేండ్‌తో మళ్లీ హేపీ మూడ్‌లోకి వచ్చాడు చంటిగాడు.

''ఏం వైభవం! ఏం వైభవం! కోటీశ్వర్రావు స్వర్గాన్ని దింపేసేడు కదండీ''

''మరే మరే! అదిగో రంభా, ఊర్వశీ..'' రెండో వరసలో నాలుగో కుర్చీలో ఒకరూ, మూడో వరసలో అయిదో కుర్చీలో ఒకరూనూ.

''ఇంద్రుడెవరో?''

''భలేవారే! ఇంకెవరూ మన కోటీశ్వర్రావే. కుబేరుడిలా మీరున్నారు.''

''మరి నువ్వూ''

''నేనూ, నా బోటి వాళ్లు కొంచెం కొంచెం పుణ్యం చేసుకున్న వాళ్లమన్నమాట'' నవ్వేడు

కుబేర కుమార్. అతడికీ పొగడ్త హాయిగా వుంది. పైగా ధనలక్ష్మీ మేరేజీ ప్లాజా అంటే అతడికి ప్రత్యేకమైన అభిమానం. అది నిర్మించిన కాంట్రాక్టర్ తనే అవటమే కాదు దానికి కారణం..తను రియల్టర్‌గా వుంటూ మొదటిసారి ఒక అమెరికా వాడితో బేరం కుదర్చడంలో సఫలమైంది కూడా ఈ స్థానంలోనే. లక్షకి బేరం కుదిరిన తోలు బొమ్మలు. ఆ బొమ్మ లాడించిన వాడి చేతిలో ఇరవై వేలు...మిగిలింది తనకి. పైగా అమెరికా వాడి షేక్ హేండ్..చిరునవ్వూ.. మెచ్చుకోలు. తను డొనేట్ చేసిన రెండు తోలుబొమ్మలు ఆ గోడలకి వేలాడుతూ వుంటే చూసుకోవడం, కింద తన పేరు మెరుస్తూంటే గర్వపడి పోవడం భలే తమాషాగా వుంటుందిప్పటికీ.

''అలంకరణకే అరవై లక్షలయితే.. ఇక భోజనాలకెంతవుతుందో'' లంబోదరుడి ప్రశ్నతో ఎవరికోసమో వెదుకుతున్న కుబేర కుమార్ ఈ లోకంలోకొచ్చేడు.

''తినబోతూ రుచెందుకు''

* * *

ఎప్పట్లానే కోటీశ్వర్రావు హాయిగా వున్నాడు. కదులుతున్న సెంటు సీసాలా అల్లుణ్ని ఇంటికి తెచ్చుకుంటోన్న అయినింటి మామగారిలా వున్నాడు. భోజనాల స్టాల్స్ దగ్గరికొచ్చాడు. అన్నీ పరిశీలించేడు. ఒకింత ఆశ్చర్యానికీ, కోపానికీ గురయ్యేడు.

''ఒరేయ్ స్వీట్లేంట్రా! ఒకటి తగ్గింది. అమ్మాయి వయసు ఇరవై రెండు. అందుకే విస్తట్లో ఇరవై రెండు రకాల స్వీట్లు పడాలన్నది నా అమ్మడి కోరిక. ఒకటి తగ్గిందేంట్రా'' అనడిగేడు. మీరట్‌నుంచొచ్చిన వాళ్లూ, రాజస్థాన్ వాళ్లూ, ఆంధ్రా పిండి వంటల వాళ్లూ ఆశ్చర్యంగా మొహాలు చూసుకున్నారు. మెనూలో ఏదో తేడా వచ్చింది. ఒక స్వీట్ వెరైటీ తగ్గింది. కొంప మునిగింది.

కోటీశ్వర్రావు మాత్రం కూల్‌గానే వున్నాడు. అతడు 'కూల్'గా వుంటే పేలబోయే ముందు అగ్నిపర్వతంలా వుంటాడు. సునామీ ముందర సముద్రంలా వుంటాడు. భోజనాల కాంట్రాక్టర్‌కి భూకంపం తాలూకు ప్రకంపనలు అర్థమయ్యేయి. క్షణాల్లో స్వీటు రప్పిస్తానన్నాడు. కోటీశ్వర్రావు ఇంకా కూలయ్యేడు. నవ్వేడు.''నువ్వు జత చేసే స్వీటు ఈ సిటీలో ఎక్కడా దొరకనిదై వుండాలి మరి. తెచ్చి పెడతావా?'' అన్నాడు.

ఒక్కసారిగా భోజనాల తయారీ స్టాల్స్‌లో కలకలం. అప్పటికప్పుడు కొత్త కాంబినేషన్ కొత్త రుచితో కొత్త స్వీటు యమా అర్జెంటుగా తయారయింది.

''దటీజ్ కోటీశ్వర్రావ్''అన్నట్టు నవ్వేడు కోటీశ్వర్రావు. రెండువేల మంది ఒకేసారి భోజనం చేసి హాయిగా లేచేందుకు వీలుగా టేబుల్స్ ఏర్పాటయ్యేయి. మిక్కీమౌస్ కూడా హడావిడిగా బయటనుండి లోనికొచ్చింది. చెక్క కాళ్ల కళాకారులు ఆవరణంతా కలియతిరుగుతున్నారు.

అదేపనిగా పెళ్లి ఏర్పాట్లని పొగుడుతోన్న భర్తని మందలిస్తోంది అతడి భార్య ''చాల్లే ఊర్కోండి! మరి అలా పొగిడేస్తుంటే వింటున్న వాళ్లు మిమ్మల్ని మరీ 'చీపు' గా అనుకుంటారు. ఏం అర్థం కాకపోయినా, అన్నీ తెలిసినట్టే వుండాలి. డిగ్నిఫైడ్‌గా''

కుబేరకుమార్ వచ్చిందగ్గర్నుంచీ ఎవరి కోసమో తెగ వెదుకుతున్నాడు. చంటిగాడు చెక్క కాళ్లవాళ్ల వంక వింతగా ఆత్రంగా చూస్తున్నాడు. ఎంత తల పెకెత్తినా వాళ్ల తల మాత్రం కనబడ్డం లేదు, వాడికి- పొడవాటి నల్లటోపీ తప్ప.

''అవునూ! ఇంత ఖర్చుపెడుతున్నారు కదా. ఇన్‌కంటాక్స్ వాళ్లు ఏం చెయ్యరా?'' ఎవరో అడిగేరు కుబేరుణ్ని.

కుబేర్ విశాలంగా నవ్వేడు.. నవ్వుతూనే.. ప్రేక్షకుల మొదటి వరసలో మూడో కుర్చీలో ఇరుగ్గా కూర్చున్నాయన్ని చూపించి, ''ఆయన ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌లో అయిదు జిల్లాలకి ఆఫీసర్. ఆ పక్కనున్న ఆయన కమర్షియల్ టాక్సు? మినిష్టర్లు, ఎమ్మెల్యేలు వచ్చి పోతున్న వాళ్లు'' అంటూ వివరించాడు.

చంటిగాడికి ఒకటే అనుమానం.. మిక్కీమౌస్‌లు ఎలా కదులుతున్నాయి. అడిగితే వాళ్ల నాన్న తిడతాడని భయం. జాగ్రత్తగా గమనిస్తున్నాడు వాటినే. కుబేర్ తన అన్వేషణలో తానున్నాడు. మళ్లీ ఓ సారి షేక్ హేండిచ్చే అవకాశం వచ్చింది చంటికి. అందుకుంటూ జాగ్రత్తగా చూసేడు. మిక్కీమౌస్ నోట్లో మనిషి తల కనబడింది. లోపల్నుంచి ఆ మనిషేదో అడుగుతున్నాడు. చంటిగాడికి అర్థం కాలేదు. ఏంటీ? అని అడిగాడు కానీ లాభం లేకపోయింది.

ఇంతలో చెక్కకాళ్ల వాడొకడు దగ్గరికొచ్చి వొంగి షేక్ హేండిచ్చాడు. అలానే వంగి మిక్కీ మౌస్‌తో మాట్లాడుతున్నాడు.

''ఇంకెంత సేపురా?''

''అరగంటలో భోజనాలంట''

మంద్రంగా మారిన మైకు శబ్దంలోంచి మిక్కీ మౌస్, పక్కనే నిలబడ్డ కుబేరకుమార్‌ని గమనిస్తోంది. ఉన్నట్టుండి కుబేర్ అన్వేషణ ఫలించింది.

''చంద్రమోహన్ గారూ!'' అన్నాడు ఆత్రంగా.

సదరు చంద్రమోహన్‌గారు- కుబేరుణ్ని గుర్తుపట్టేరు. పూర్తిగా గుర్తుపట్టనట్టు నటించడంలో పూర్తిగా సఫలమయ్యేరు.

మళ్లీ పిలిచాడు కుబేర్.

మళ్లీ పట్టించుకోలేదు చంద్రమోహన్.

''నాన్నా!నాన్నా! పొడుగు కాళ్లబ్బాయి కూడా నాకు షేక్ హేండిచ్చాడు'' అంటోన్న చంటిగాడ్ని వదిలించుకుని మరీ చంద్రమోహన్ దగ్గరికి చేరాడు. ఇక తప్పదన్నట్టు గుర్తుపట్టేడు చంద్రమోహన్. చంటిగాడు వాళ్ల దగ్గరికి చేరేప్పటికి..

చంద్రమోహన్ చేతులు పట్టుకుని బతిమాలు తున్నాడు కుబేర్ ''ఐ బెగ్ యూ సర్! ఐ బెగ్ యూ! ఆ కాంట్రాక్ట్ పోతే ఎలా చెప్పండి. అంతా మీ చేతుల్లోనే వుంది. జరిగిందేదో జరిగిపోయింది. పి.సి.(పర్సంటేజీ) పెంచుదాం. నాకు మాత్రం హేండివ్వకండి ప్లీజ్. మీ వల్లే అవుతుంది. ఎగైన్ బెగ్ యూ'' అంటున్నాడు.

హఠాత్తుగా చంటిగాడికి బెగ్గర్స్ అంటే ఏమిటో కొంచెం అర్థం అయింది. కానీ వాళ్లని కుక్కల్నీ పందుల్నీ కాల్చినట్టు ఎందుక్కాల్చేయాలో అర్థం కాలేదు.

ఇంకా బ్రతిమాలడం జరుగుతోంది. యాభై కోట్ల తాలూకు కాంట్రాక్ట్ అది. ప్రభుత్వంలోని అతి పెద్ద పదవిలో వెలిగిపోతున్న చంద్రమోహన్‌కీ, కాంట్రాక్టర్ కుబేరకుమార్‌కీ బేరం బాలన్స్ అవడం లేదు. కోటీశ్వర్రావు గారి పుణ్యమా అని బతిమాల డానికీ 'సిట్టింగ్' వేయడానికి ఛాన్స్ దొరికింది, ఇవి చేతుల కాదంటున్నాడు. ఎంత కావాలో మీ ఇష్టం అంటున్నాడు. ఐ బెగ్ యూ అంటున్నాడు. మిక్కీ మౌస్‌లోంచి సూరిబాబు వాళ్లనే గమనిస్తున్నాడు. అరగంట క్రితం..అడుక్కునే వాళ్లని తెగతిట్టి తరిమేసినాయన ఇప్పుడిలా అడుక్కోవటం చూస్తుంటే అతడికి నవ్వొస్తోంది.

మంత్రిగారి రాకతో వాతావరణం మారిపోయింది. రెణ్నిమిషాలుండి కుబేరకుమార్‌కీ చంద్రమోహన్‌కీ మధ్యవర్తిత్వం నిర్వర్తించి, అక్షింతలేసి ''భోజనాలెక్కడ?'' అన్నారు మంత్రి. ఇంతలో ఎవరో టీవీ నటుడూ, నటీ దిగారు. ఆడాళ్ల సీరియల్ హడావిడి మొదలైంది. ఉండుండీ నదీ కెరటాల్లా ఆనందం ఎగిరెగిరి పడుతుంటే కోటీశ్వర్రావు కళ్లు గర్వంతో మెరుస్తున్నాయి.

పొడవాటి కర్రకాళ్లతో నడుస్తూ నడుస్తూ ఉన్నట్టుండి తూలి పడబోయిన సుబ్బిగాడ్ని దూరం నుండీ చూసి నారాయుడి గుండె కలుక్కుమంది. చీకట్లోంచి చూస్తుంటే దూరంగా పగటిని తలపించేంత వెలుతురులో అంతా స్పష్టంగా కనిపిస్తోంది. తన తర్వాతి తరం వాళ్లు, ఇప్పటి మార్పుకి తమని తాము అలవాటు చేసుకోవడం గమనిస్తున్నాడు. తొడుగుల్లో దూరి వారి జీవన విధానాన్ని ఏర్పరుచుకోవడం. ఆ బొమ్మల్లో వాడికి 'ఫేన్' వుంటుంది. భోజనం పెట్టి రెండొందలిస్తారు.''ఇంకేం కావాలి తాతా!'' అంటాడు సూరిబాబు. అవున్నిజమే ఇంకేం కావాలి మనిషికి..!! తోలుబొమ్మలాటని నాటకం మింగేసింది. నాటకాన్ని సినిమా మింగేసింది. సినిమాని టీవీ మింగేసింది. ఇంకేం కావాలి...టీవీలూ, సినిమాలూ సంప్రదాయాన్ని మింగేయడం గురించెవరూ మాట్లాడరేం. సంవత్సరాదాయంలోంచి గంగిరెడ్లవాడికీ, పిచ్చుకుంటలవాడికీ, తోలుబొమ్మలాటల వాళ్లకీ ఇంతింతగా పంచిపెట్టడం, ఊరు ఊరంతా సాముహిక గానాలు చేయడమనేది మాయమై పోవడం గురించి ఎవరికీ పట్టదేం?

శ్రీ రాముల వారి పెళ్లితంతుని అడ్డుపెట్టుకుని తోలుబొమ్మలాటలో కేతిగాడు, బంగారక్కల చేత జనానికి చెప్పించిన విషయాలు గుర్తొస్తున్నాయి నారాయుడికి. జానాక్యాం కమలాయతాం పుటేయా నుంచీ ముహూర్తాలూ, పసుబ్బట్టలూ, బెల్లం, జీలకర్ర గురించి, పసుపుతాడు గురించి, పసుపు కలిపిన బియ్యం గురించీ, అరుంధతీ నక్షత్రం గురించి, చెప్పే కేతిగాడేడీ? బంగారక్క ఎక్కడా? సంప్రదాయం పుట్టిందెందుకూ? దాని వెనుకనున్న శాస్త్రీయత, మానవ సంబంధాల సున్నితత్వం..

బంతి భోజనాల వెనకనున్న సామాజిక సత్యం..
''ఏంట్రా తాతా! నీలో నువ్వే ఆలోచిస్తున్నావ్?''
తన ఆలోచనలన్నీ వివరించేడు. కుష్ఠురోగపోడికి ఇయ్యన్నీ ఎలా తెల్సని ఆశ్చర్యపోతున్నారేంట్రా? అంటూ నవ్వుతూ వివాహ సంప్రదాయల్ని ఒక్కొక్కటిగా వివరించడం మొదలెట్టాడు.

అతడికీ మాటే ఆనందం..తన తర్వాతి తరమొకటి వినడానికిష్టపడుతోంది.. అది చాలు.

''అదిరా అబ్బీ ముహుర్తమంటే...''అంటూ చెప్పసాగాడు.

* * *

''ముహుర్తమా గాడిదగుడ్డా. పెళ్లికూతురికి గానీ, పెళ్లి కొడుకుగ్గానీ మనకి అంత బాగా తెలుసేంటీ..కోటేశ్వర్రావు గారి కళ్లలో పడితే అన్ని సంప్రదాయాలు అద్భుతంగా పాటించినట్టే.. ఏవంటారు. అంతే. భోజనాలు చేద్దాం రండి. లేవండి'' అంటున్నాడు ఓ అతిథి.

భోజనాలు ప్రారంభమయ్యాయి.

* * *

మొలక విత్తనాలతో మొదలైంది కథ. పచ్చికూరల గురించీ, మొలక విత్తనాల గురించీ అక్కడి జనం చెప్పుకుంటోన్న వింతలూ విశేషాల్తో అక్కడ వడ్డించేవాళ్లెవరికీ పట్టడం లేదు. కుబేరకుమార్ చంటిగాడికి ముందే 'ఇన్‌స్ట్రక్షన్స్' ఇచ్చాడు, ఇంగ్లీషులో. గుడ్‌మానర్స్ అంటే ఏంటో, ఎలా తినాలో, ఎంత వదిలేయాలో ఇలాంటివి. చంద్రమోహన్‌ని బలవంతంగా తనతో పాటూ భోజనం చేసే ఏర్పాటు చేసుకోవడంలో సఫలీకృతుడయ్యాడు. బేరం బేలన్స్ అవడంతో చంద్రమోహన్ మొహంలో మెర్క్యురీ నవ్వొకటి తళుక్కుమంటోంది.

భోజనాల దగ్గరు మామూలుగానే షుగర్ గురించీ, బీపీ గురించీ ప్రకృతి వైద్యం గురించీ, హార్ట్ ఎటాక్‌ల గురించీ ఎవరికీ తెలిసింది వారు, అదే నిజమన్నంతగా చెప్పుకుంటున్నారు.

ఒక్కొక్క ప్లేటులోనూ ఇరవైరెండు రకాల స్వీట్లు, పది రకాల అన్నాలు, పన్నెండు రకాల కూరలు(కలిపి ఇరవై రెండు), ఇరవై రెండురకాల ఫలాలతో ఫ్రూట్‌సలాడ్, ఇరవై రెండు రకాల ఐస్‌క్రీంలూ.. ఇవి వద్దనుకుంటే ఇరవై రెండు రకాల టిఫిన్ వైరైటీలూ. తిన్నారా లేదా అన్నది కాదు ముఖ్యం. ప్రతీ విస్తరిలోనూ అవన్నీ వడ్డించబడాలని కోటీశ్వర్రావు ఆర్డరు.

కుబేరుడికి ప్రొద్దున్నుంచీ వున్న టెన్షన్ పోయింది. చంద్రమోహన్ ప్రసన్నుడవటంతో, దాని స్థానే వెర్రాకలి మొదలైంది. కడుపులోంచి మంటని గమనించి ఎంతాకలి అనుకున్నాడు. అక్కడున్న తిండి వైరైటీల మహిమ మరి అని కూడా అనుకున్నాడు. వద్దంటున్నా వడ్డించేస్తున్న వారిని వారించేంత సమయం కూడా లేదు. అతడి కాగితం కంచం నిండా ఆహారపదార్థాలు నింపబడ్డాయి. మంట పెరిగింది. రెండో స్వీటు తినబోతుండగా ఆ మంట గుండెమంట తాలూకు మంటేమోనన్న అనుమానం మొదటిసారి కలిగింది. స్వీటు సగం తినేసరికి కళ్లు తిరిగినట్లని పించింది. తను తనుకాకుండా పోతున్న ఫీలింగ్ వచ్చింది. ఏమైందేమైందంటూ చంద్రమోహన్ కంగారుగా అడగటమొక్కటే గుర్తుంది. అంతే. స్పృహ తప్పింది. చంటిగాడు దూరంగా వున్న వాళ్లమ్మ వైపు పరుగెత్తాడు. ఎవరికో హార్ట్ ఎటాక్ అన్న విషయం దావానలమైంది. రెండు నిమిషాలు విందాగింది. 108 వచ్చింది. కుబేర్‌కుమార్‌తో 108, దాని వెనకే అతడికారు అయిదు నక్షత్రాల ఆసుపత్రి వైపు పరుగెట్టాయి.

''ఫర్వా లేదా?'' అంటున్నారెవరో.

''అబ్బే ఏం ఫర్వా లేదు. హార్టెటాకు కాదు.. నా బొందా కాదు. సుగర్‌లెవెల్స్ డౌన్ అయ్యాయంతే. 'మైల్డ్' నో ప్రాబ్లం- అనిపించాడు కోటీశ్వర్రావు అక్కడి అతిథుల్లో ఒక డాక్టర్ చేత. కోటీశ్వర్రావు మైల్డ్ అంటే మైల్డే. నో ప్రాబ్లం అంటే నో ప్రాబ్లమనే. అంచేత విందు మళ్లీ మొదలైంది.

ఈ గందరగోళాన్ని గమనిస్తోన్న మిక్కీమౌస్‌లోని సూరిగాడికెందుకో అకారణ దుఃఖం కలిగింది. బొమ్మలో ఏడుస్తున్నాడు. నవ్వుతున్న మిక్కీమౌస్‌లో ఏడుస్తున్న సూరిగాడికి తోడుగా ఆ బొమ్మతో అమర్చిన చిన్న ఫేన్(వాడికి తగిలేందుకు).

కుబేరుడి తాలుకూ విస్తరాకు వడ్డించింది వడ్డించినట్టే చుట్ట చుట్టేరు. గోడ అవతలి వైపుకు విసిరేసేరు.

**గోడకి ఇటు...**

అప్పటిదాకా గోడకి దగ్గరగా కూర్చుని వివాహం తాలూకు సంప్రదాయాన్ని వివరించి, తన జ్ఞాపకాల్లోకెళ్లిపోయిన నారాయుడు ఒక విస్తరి క్రింద పడబోవడాన్ని గమనించేడు. ఎంగిలి విస్తర్ల హడావిడి మొదలవ్వకపోవడం చేత కుక్కలింకా పోగవలేదు. ఒక్క ఉదుటున పడిపోతున్న విస్తరిని గాల్లోనే అందుకున్నాడు.

''అదేంట్రా! మావా! భోజనాలవకుండానే విస్తరి పండిందేంటీ''

నారాయుడు మాట్లాడలేదు. నిశ్శబ్దంగా విస్తరి పొట్లాం విప్పేడు. అతడి కళ్లతడయ్యాయి. రెండు చేతులూ పట్టనంత బంగారపు ముచ్చిరేకు విస్తరి. స్వీట్ల దుకాణంలోని అన్ని స్వీటు వైరైటీలు 'పెద్ద' హోటల్‌లో దొరికే అన్ని రకాల ఆహార పదార్థాలూ వడ్డించేసినట్టు. ప్రక్కనే జేరిన సత్తిగాడి కళ్లు మిలమిలలాడిపోతున్నాయి.

''భలే పెళ్లిరా! మామా!'' అన్నాడు. అదృష్ట వంతుడు అని కూడా అన్నాడు.. ఎవరు అదృష్ట వంతుడో సత్తిగాడిక్కూడా అవగాహన లేదు. ఆ భోజనం చూడగానే అనాలనిపించిందంతే.

నారాయుడు ఆ విస్తరి వంక రెండు క్షణాలపాటూ చూసేడు. జాగ్రతగా మళ్లీ పొట్లాం కట్టేసేడు. సత్తిగాడికి ఆశ్చర్యం రెట్టింపయింది.

''అదేంట్రా ముసలోడా! తినవా!''

''.........................''

''నచ్చలేదేంట్రా''

''.........................''

''అన్నపూర్ణరా! దేముడురా! అలా మళ్లీ పొట్లాం కట్టేసేవేంట్రా''

'' ఏటి మాట్లాడవేట్రా! అన్నీ చూసే తలికే (సరికే) కడుపునిండిపోయుంటదెదవకి''

''.....................''

జాగ్రత్తగా పొట్లాం కట్టడం పూర్తయ్యాక అప్పుడు నవ్వేడు నారాయుడు. కడుపారా- మీసాల మాటునుంచి అప్పటిదాకా సత్తిగాడికి తెలినీ జీవన సత్యంలా వుందానవ్వు.

''ఆకలిమంట కోటీశ్వర్రావుగారి కూతురి పెళ్లిలో వెలుగుతోన్నో మెర్క్యురీ లైటు వేడిలా వుండదురా అబ్బీ! లెప్రసీ కాలనీకి ఉన్నట్టుండి నిప్పంటుకున్నట్టుంటుంది. ఇక ఇది ఒక్కడు తినే భోజనం కాదురా సత్తీ! అరడజను మంది హాయిగా తినగలిగినంత విందు. పంచుకు తినాల్సినదేదైనా సామాజికమే అవ్వాలిగానీ వ్యక్తిగతమైపోకూడదు. భోజనమైనా, తోలుబొమ్మలాటైనా.. సంప్రదాయమైనా!! నువ్వన్నట్టు ఇది ఒక్కణ్నే తినేస్తే గుండె పోటొచ్చినా ఆశ్చర్యం లేదు'' అంటూ జాగ్రత్తగా మూటగట్టిన అన్నం విస్తరితో లెప్రసీ కాలనీ వైపు సాగిపోయేడు.

★

## రచయిత పరిచయం



'కొబ్బరాకు' కవితా సంకలనంతో కొబ్బరాకు సుధాకర్‌గా సాహితీ లోకానికి చిరపరచితుడినైన నా పూర్తి పేరు డా.ఎల్.కె.సుధాకర్. వృత్తిరీత్యా వెటర్నరీ డాక్టర్ని. చాసో, కొడవటిగంటి, శ్రీరమణ, యండమూరి ఇష్టమైన రచయితలు. తూర్పుగోదావరి జిల్లా అంగర స్వగ్రామం. 'గొబ్బిపూలు' కథా సంకలనం 2003లో వెలువడింది. ఇంతవరకూ ఆంధ్రభూమి కథల పోటీలో వరుసగా రెండు ప్రథమ, ఒక కన్సొలేషన్ బహుమతి, తానా వారి కన్సొలేషన్ బహుమతి, విపుల కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి, ఆటావారి కవితల పోటీలో బహుమతి వచ్చాయి. నవ్య (ఆంధ్రజ్యోతి ప్రచురణ)లో బహుమతి అందుకోవడం ఉద్విగ్నంగానూ, 'కొంచెం' గర్వంగానూ వుంది. నా కథకి ద్వితీయ బహుమతి ప్రకటించిన సి.పి.బ్రౌన్ అకాడమీ, నవ్య వీక్లీకి నా కృతజ్ఞతలు.

**- డా.ఎల్.కె.సుధాకర్ (కాకినాడ)**